AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

13-4-2026 (Monday)


MAIN EDITION

## కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు



**అక్షరటుడే, హైదరాబాద్:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపించారు. తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. 48 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అంగన్‌వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లు అందజేసింది. అయితే ఇందులో అక్రమాలు చోటు చేసుకున్నాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో తనపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీతక్క పేర్కొన్నారు. ఇటీవల ఆమె మాట్లాడుతూ.. తాట తీస్తానని హెచ్చరించారు. ఈ క్రమంలో తాజాగా కేసీఆర్‌కు నోటీసులు పంపారు.

## కార్మికుల ఆందోళన హింసాత్మకం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** జీతాలు పెంచాలని కార్మికులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. ఈ ఘటన ఢిల్లీలోని నోయిడా సెక్టార్ 2లో చోటు చేసుకుంది. కార్మికులు ఆఫీసు అద్దాలు ధ్వంసం చేశారు. వాహనాలకు నిప్పు పెట్టారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు యత్నించగా.. ఆందోళనకారులు వాహనాలను ధ్వంసం చేస్తూ, రాళ్లు విసిరారు. అనేక ఫ్యాక్టరీలు ఉన్న నోయిడా ఫేజ్ 2లో నిరసన తెలుపుతున్న కార్మికులు ఒక పోలీస్ వ్యాన్, ఇతర వాహనాలను ధ్వంసం చేశారు. జీతాల పెంపు, ఇతర ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఆందోళన చేస్తున్నారు.

## ఆర్ఆర్ మేనేజర్‌కు బీసీసీఐ నోటీసులు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఆర్‌సీబీతో మ్యాచ్ సందర్భంగా డగౌట్‌లో ఫోన్ వాడిన రాజస్థాన్ రాయల్స్ టీం మేనేజర్ రోమీ భిందర్‌కు బీసీసీఐ షోకాజ్ నోటీసు ఇచ్చింది. ఈ నెల 10న మ్యాచ్ సందర్భంగా డగౌట్‌లో ఆయన ఫోన్ మాట్లాడుతూ కనిపించారు. 48 గంటల్లో దీనిపై సమాధానం చెప్పాలని ఆదేశించింది.

## అమెరికాకు ఇరాన్ వార్నింగ్..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు విఫలమవడంతో ఆందోళన నెలకొంది. హర్ముజ్ జలసంధిలోని ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు సాగించే అన్ని నౌకలపై అమెరికా దిగ్బంధనం విధించింది. దీంతో గల్ఫ్, ఒమన్ సముద్రంలోని ఏ ఓడరేవు కూడా సురక్షితంగా ఉండదని ఐఆర్‌జీసీ సోమవారం హెచ్చరించింది.

## నష్టాల్లో ముగిసిన మార్కెట్



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఇరాన్-అమెరికా మధ్య చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీనికితోడు చమురు ధరలు పెరగడమూ ప్రతికూల ప్రభావం చూపింది. సెన్సెక్స్ 700 పాయింట్ల నష్టంతో క్లోజ్ అయ్యింది.

## అభిమానుల పూలవర్షం.. భయపడిన టీవీకే చీఫ్ విజయ్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** తమిళనాడులో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. టీవీకే అధినేత, నటుడు విజయ్, పెరంబూర్, తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గాల్లో ఆదివారం ప్రచారం చేశారు. ఇందులో భాగంగా విజయ్ సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేశారు. అయితే తమ అభిమాన నటుడు, నాయకుడు సైకిల్‌పై దగ్గరగా కనిపించడంతో ఫ్యాన్స్ ఖుషీ అయ్యారు. ఈ క్రమంలో ఆయనపై పూల వర్షం కురిపించారు. కొందరు అభిమానులు ఒక్కసారిగా వచ్చి పూలు చల్లడంతో టీవీకే చీఫ్ విజయ్ భయపడిపోయారు. వెంటనే సైకిల్ ఆపి దిగిపోయారు. పరుగెత్తుకుంటూ వెళ్లి తన వాహనంలో ఎక్కారు.

## నీటి గుంతలో పడి కానిస్టేబుల్ మృతి

**అక్షరటుడే, వికారాబాద్:** ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో చోటు చేసుకుంది. తాండూరులో భద్రేశ్వర స్వామి జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ జాతర బందోబస్తు విధుల కోసం నర్సింలు వెళ్లారు. రాత్రి పూట విధులు ముగించుకొని తన స్వగ్రామానికి బయలు దేరాడు. బ్రిడ్జి నిర్మాణం ప్రాంతంలో ఉన్న నీటి గుంతలో ఆయన ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. చీకటిగా ఉండడంతో గుంతను గమనించలేక ప్రమాదం జరిగినట్లు సమాచారం.



**మహిళా సాధికారిత లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అభివృద్ధి ప్రయాణంలో అతిపెద్ద నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలిపారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో సోమవారం జరిగిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్'లో ఆయన మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును "నారీ శక్తి"కి అంకితమైన ఒక చారిత్రక ముందడుగుగా ప్రధాని అభివర్ణించారు. 21వ శతాబ్దపు అత్యంత కీలకమైన నిర్ణయాలలో ఒకదానిని దేశం తీసుకోబోతోందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం నారీ శక్తికి అంకితం అన్నారు.**

– అక్షరటుడే, నేషనల్ డెస్క్

# దేశ చరిత్రలో గొప్ప నిర్ణయం

■ మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని మోదీ ■ నారీ శక్తికి అంకితమని ప్రకటన ■ అందరూ మద్దతు తెలపాలని విజ్ఞప్తి

కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తున్న విషయం తెలిసిందే. గతంలోనే ఈ బిల్లు తీసుకురాగా.. తాజాగా దానికి సవరణలు చేయనున్నారు. ఈ మేరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈ నెల 16 నుంచి 18 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజనకు సైతం ఆమోదం తెలపనున్నారు. ఈ క్రమంలో తాజాగా మోదీ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. సామాజిక న్యాయాన్ని పాలనలోనూ, నిర్ణయాల రూపకల్పనలోనూ ఒక అంతర్భాగంగా మార్చేదిగా దీనిని అభివర్ణించారు.

### గొప్ప సంకల్పం

మన పార్లమెంటు కొత్త చరిత్రను సృష్టించే దిశగా అడుగులు వేస్తోందని ప్రధాని అన్నారు. సామాజిక న్యాయం నినాదంగా కాకుండా, మన పని సంస్కృతిలోనూ, మన నిర్ణయాల రూపకల్పన ప్రక్రియలోనూ ఒక సహజ భాగంగా ఉండే, సమసమాజ భారతదేశం కోసం తీసుకున్న ఒక సంకల్పం ఇది అన్నారు. అసెంబ్లీల నుంచి పార్లమెంటు వరకు దశాబ్దాలుగా సాగిన నిరీక్షణకు తెరదించే సమయం ఆసన్నమైందని చెప్పారు. ఆ కీలక ఘట్టం ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో జరగనుందన్నారు.

### విప్ జారీ

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సభ్యులకు విప్ జారీ చేశాయి. సమావేశాలకు సభ్యులందరూ హాజరు కావాలని పేర్కొన్నాయి. మహిళా రిజర్వేషన్ బిల్లుపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ఆమోదించే అవకాశం ఉంది.

### దశాబ్దాలుగా..


మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన ఆవశ్యకత దశాబ్దాలుగా అందరూ భావిస్తున్నారని మోదీ పేర్కొన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఈ చర్చ కొనసాగుతోందన్నారు. ఇందులో అన్ని రాజకీయ పార్టీల, అనేక తరాల కృషి ఉందని తెలిపారు. ప్రతి పార్టీ తనదైన రీతిలో ఈ ఆలోచనను ముందుకు తీసుకువెళ్లిందని కొనియాడారు. కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి తదితరులు పాల్గొన్నారు.

## అఖిలపక్ష భేటీ పెట్టాలి.. ప్రధానికి సీఎం రేవంత్ లేఖ



**అక్షరటుడే, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. లోక్‌సభ సీట్ల పెంపు విషయమై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కోరారు. చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇదే సమయంలో నియోజకవర్గాల పెంపునకు సైతం ఆమోదం తెలపనున్నారు. ఈ క్రమంలో రేవంత్‌రెడ్డి ప్రధానికి లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ సీట్ల పునర్విభజన వేర్వేరు అని అన్నారు. రాష్ట్రాల వారీగా అసెంబ్లీ సీట్లకు మహిళా కోటాను వెంటనే అమలు చేస్తే, యావత్ దేశం స్వాగతిస్తుందన్నారు. మహిళా రిజర్వేషన్ పేరిట జనాభా ఆధారిత లోక్‌సభ పునర్విభజన చేపడితే దక్షిణ, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సభపు పునర్విభజన కోసం కేవలం దామాషా పద్ధతి కాకుండా ఇతర నమూనాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

## డిగ్రీలో ప్రవేశాలకు.. దోస్త్ నోటిఫికేషన్ విడుదల




**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల అయింది. 2026-27 విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి సోమవారం విడుదల చేశారు. రాష్ట్రంలో ఇంటర్ ఫలితాలు ఆదివారం విడుదలైన విషయం తెలిసిందే. దీంతో దోస్త్ రిజిస్ట్రేషన్, సీట్ల కేటాయింపు ప్రక్రియ మూడు దశల్లో నిర్వహించనున్నారు. ఏప్రిల్ 15 నుంచి మే 7 వరకు తొలిదశ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ఏప్రిల్ 30 నుంచి మే 8 వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టడానికి అవకాశం ఉంది. మే 14న సీట్లు కేటాయించారు. తొలిదశలో సీటు వచ్చిన వారు మే 15 నుంచి 23 వరకు రిపోర్టు చేయాలి. దోస్త్ రెండో దశ రిజిస్ట్రేషన్ మే 15 నుంచి మే 25 వరకు కొనసాగనుంది. మే 15 నుంచి మే 26 వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చు. మే 30న సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది.

## మరింత పెరగనున్న ఎండలు..


**అక్షరటుడే, హైదరాబాద్:** భానుడు భగ భగ మండుతున్నాడు. రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతోంది. ఉదయం 9 గంటలకే కాలు బయట పెట్టలేని పరిస్థితి. సాయంత్రం 5 గంటల వరకు కూడా సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఎండల ధాటికి ప్రజలు అల్లాడుతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఈ క్రమంలో వాతావరణ శాఖ అధికారులు మరో షాకింగ్ వార్త చెప్పారు. నేటి నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని హెచ్చరించారు. వడగాలులు వీస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో రానున్న వారం రోజులలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, గద్వాల్ జిల్లాలలో 42-45C ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. హైదరాబాద్‌లో 40-42 డిగ్రీలు ఉండనున్నాయి.



## చీరకట్టులో ఆకట్టుకుంటున్న ఐశ్వర్య రాజేశ్

**'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో భాగ్యంగా ఐశ్వర్య రాజేష్ అలరించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వివిధ చిత్రాలతో బిజీగా ఉన్నారు. సోషల్ మీడియాలో కూడా యాక్టీవ్‌గా ఉండే ఈ నేచురల్ బ్యూటీ.. లేటెస్టుగా ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫొటోలను పోస్ట్ చేసింది. ఆమె షేర్ చేసిన పిక్స్ నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇందులో ఐశ్వర్య సంప్రదాయబద్ధంగా చీరకట్టుతో ఎంతో అందంగా కనిపిస్తోంది. ఈ ఫొటోలు వైరల్‌గా మారాయి.**

- అక్షరటుడే, సినిమాడెస్క్



## కట్నం కోసం ప్రభుత్వ ఉద్యోగం పేరిట మోసం

**అక్షరటుడే, నల్గొండ:** ప్రస్తుతం మార్కెట్‌లో యువకులకు సర్కారు కొలువు ఉంటే తమ కూతురిని ఇచ్చి వివాహం చేస్తున్నారు చాలా మంది తల్లిదండ్రులు. అంతేగాకుండా కోట్ల రూపాయల కట్న కానుకులు సమర్పించుకుంటున్నారు. దీనిని క్యాష్ చేసుకోవాలని ఓ వ్యక్తి ప్లాన్ వేశాడు. నల్గొండ జిల్లా మాడుగుల మండలం చెరువుపల్లి గ్రామానికి చెందిన పనస మధు గౌడ్(30) అనే యువకుడు జీవనోపాధి కోసం వచ్చి అల్కాపురి ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నించినా రాలేదు. దీంతో చర్లపల్లి ఎఫ్‌సీఐలో గ్రేడ్-3 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా నకిలీ ఐడీకార్డు సృష్టించి, అందరిని నమ్మించాడు. తాను ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాని చెప్పి పెళ్లి సంబంధాలు చూడడం ప్రారంభించాడు. ఈ క్రమంలో మధుగౌడ్‌కు నల్గొండ జిల్లాకు చెందిన ఓ యువతితో పెళ్లి సంబంధం కుదిరింది. రూ.1.5 కోట్ల కట్నం ఇచ్చేందుకు ఒప్పుకున్న అమ్మాయి తల్లిదండ్రులు నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. అయితే ప్రీ వెడ్డింగ్ షూట్ సమయంలో అతనిపై అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు ఆరా తీయగా.. అసలు నిజం తెలిసింది. మధుగౌడ్ ప్రభుత్వ ఉద్యోగం చేయడం లేదని, నకిలీ ఐడీ కార్డుతో మోసం చేశాడని గుర్తించారు.

## తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల..




**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష నోటిఫికేషన్ సోమవారం విడుదలైంది. అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు సార్లు టెట్ నిర్వహిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు అధికారం చేపట్టిన తర్వాత ఏడాదికి రెండు సార్లు టెట్ నిర్వహిస్తోంది. గతేడాది జూన్, నవంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజాగా మరోసారి టెట్ పరీక్షల కోసం నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. టెట్ పరీక్ష కోసం అభ్యర్థులు ఏప్రిల్ 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 15 నుంచి 30 వరకు సీబీటీ విధానంలో పరీక్షలు జరగనున్నాయి. 2025 నవంబర్‌లో వెలువడిన నోటిఫికేషన్ ఫలితాలు ఇటీవల విడుదల అయ్యాయి. అయితే 2026లో పరీక్ష కోసం ఇటీవల విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించగా.. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అనుమతి ఇచ్చారు. దీంతో నోటిఫికేషన్ విడుదల అయింది.